సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 1 । మే । 2023



ఇంటర్‌తో కొలువు

ఇంటర్ పూర్తయిన వెంటనే విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కల్పించేలా హెచ్‌సీఎల్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకుంది. 8లో



కళా రంగానికి ప్రోత్సాహం

సాంఘిక దురాచారాలను పారద్రోలడంలో నాటక రంగం చేసిన కృషి ప్రసంశనీయమని సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. 8లో



మోగనున్న పెళ్లి బాజాలు

వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు రానుండటంతో కల్యాణ మండపాలు, పురోహితులకు డిమాండ్ పెరిగింది. 8లో

న్యూస్‌రీల్

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10.01 లక్షల విరాళం



ఈఓ త్రినాథరావుకు విరాళం అందిస్తున్న దాతలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక ఫైనాన్స్ కంపెనీ అధినేతలు ఆదివారం రూ.10,01,116ను విరాళంగా అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా జట్లపాలెంకు చెందిన కోడూరి వీరరాఘవులు, తన కుమారులు విజయ్‌కుమార్, అజయ్‌కుమార్ నూజివీడులోని తమ షణ్ముఖ మోటార్స్ ఆటో ఫైనాన్స్ కంపెనీ పేరున విరాళాన్ని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావుకు డీడీ రూపంలో అందజేశారు. విరాళం బాండ్ అందించి దాతలను ఈఓ అభినందించారు. వీరు గతంలో దేవస్థానానికి రూ.10.40 లక్షల విలువైన శానిటరీ ఫ్లోర్ క్లీనింగ్ మెషీన్ అందించినట్టు ఈఓ త్రినాథరావు తెలిపారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన



ఆందోళన చేపట్టిన రోగి బంధువులు

తణుకు: ఆపరేషన్ అనంతరం చికిత్స పొందుతున్న రోగి రెండు గంటల వ్యవధిలోనే మృతి చెందిన ఘటన తణుకు సొసైటీ రోడ్డులోని సుధా ఆస్పత్రిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దీంతో మృతుడు గణపవరం మండలం నిడమర్రుకి చెందిన వాగ్వాల కుమారస్వామి (28) బంధువులు ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కిడ్నీలో రాళ్లు ఉండటంతో నొప్పి వస్తోందని కుమారస్వామి ఈనెల 28న సుధా ఆస్పత్రిలో చేరారు. విశాఖ నుంచి వచ్చిన వైద్యుడు ఎన్.రవికుమార్‌రాజు ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆపరేషన్ చేశారు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటలకు కుమారస్వామి మృతిచెందినట్టు బంధువులకు వైద్యులు సమాచారం ఇచ్చారు. దీంతో మృతుని బంధువులు రాత్రి పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో వాగ్వాదానికి దిగారు. ఆస్పత్రిలో ఫర్నీచర్ ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఆగ్రహంతో రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోగా పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ ఇక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు కుమారస్వామికి భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దెందులూరు నియోజకవర్గ ఐటీ, సోషల్ మీడియా ప్రతినిధులు మేరుగు అనిల్, తాతా యోగేంద్ర ఆదివారం ఎస్సై ఐ.వీర్రాజును కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు మాట్లాడుతూ ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఫాలోవర్స్ పేజీలో వేలాది మంది ఫాలోవర్స్ ఉన్నారని అయితే టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఐడీని క్రియేట్ చేసుకుని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. దీనిపై పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరాల దేవుడు వరుడయ్యాడు



చినవెంకన్న ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లకు పెండ్లి ముస్తాబు తంతు జరిపిస్తున్న పండితులు

వైభవంగా చినవెంకన్న బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల: నుదుటన కల్యాణ తిలకం.. బుగ్గన చుక్కలతో సర్వాభరణ భూషితుడైన శ్రీవారు పెండ్లి కుమారుడిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు పెండ్లి కుమార్తెలుగా శోభిల్లారు. ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలను ఆదివారం ఈఓ వేంద్ర త్రినాథరావు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం నిత్య కల్యాణ మండపంలో పండితులు శ్రీవారు, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేసే వేడుకను ఘనంగా నిర్వహించారు. శ్రీహరి కళాతోరణంపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి గజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామివారు శ్రీ భూసమేత మహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు.



భూసమేత మహా విష్ణువు అలంకారం



ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి భక్తిరంజని
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరి
- సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనాలు
- రాత్రి 7 గంటల నుంచి కూడిపూడి, భరత నాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి అంకురార్పణ, రుత్విగ్వరణ, ధ్వజారోహణం
- రాత్రి 9 గంటల నుంచి హంస వాహనంపై తిరువీధి సేవ

శ్రీవారి ప్రత్యేక అలంకారం : కాళీయమర్దనం

మొక్కలకు వైద్యులు

- ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ల ఏర్పాటు
- మండలానికి ఒకరు చొప్పున డాక్టర్ నియామకం
- రైతు భరోసా కేంద్రాల ద్వారా చర్యలు
- ఆరోగ్యకర పంటలే లక్ష్యంగా చర్యలు
- తొలిదశలో 47 మందికి ప్రత్యేక శిక్షణ





ఏలూరు (మెట్రో): రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. విత్తు నుంచి పంట విక్రయం వరకూ అన్నిదశల్లోనూ అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారు. తాజాగా మరో ముందడుగు వేసి మొక్కల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా పంటల డాక్టర్లను నియమించనున్నారు. మొక్కలు ఏంటి.. వైద్యులేంటి అని ఆశ్చర్యపోతున్నారా.. ఫ్యామిలీ డాక్టర్ తరహాలోనే ప్లాంట్ డాక్టర్ అనే మరో విప్లవాత్మక విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

వ్యవసాయం పండుగే..

వ్యవసాయం దండగ అనే రోజుల నుంచి వ్యవసాయం పండుగ అనే స్థాయికి వైఎస్సార్ సీపీ సర్కారు రైతులను తీసుకువచ్చింది. గ్రామాల్లోనే స్థానికంగా రైతులకు సేవలందించేలా రైతు భరోసా కేంద్రాలను (ఆర్‌బీకే) ఏర్పాటుచేసింది. ఇప్పుడు రైతులు పండించే పంటలు పూర్తి నాణ్యతతో ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు చర్యలు తీసుకోనుంది. రైతు భరోసా కేంద్రాల్లోనే ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ (పీహెచ్‌డీసీ)లను ఏర్పాటు చేస్తుంది. దీనిలో వైద్యులను నియమించనుంది. వీరు రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తూ సూచనలు, సలహాలు అందిస్తారు. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 904 ఆర్‌బీకేల ద్వారా సేవలందిస్తున్నారు.

వీపీఏల ద్వారా..

ఆర్‌బీకేల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు (వీపీఏ)ను వైద్యులుగా నియమించనున్నారు. వీరు పొలాల్లోకి వెళ్లి మొక్కలకు ఆశించే చీడపీడలను ముందుగా గుర్తించడంతో పాటు సస్యరక్షణ చర్యలను సూచిస్తారు. అలాగే రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ ఆయా పంటలు ఎదుర్కొనే సమస్యలను వీరు అధికారుల దృష్టికి తీసుకువెళతారు. సమస్య తీవ్రతను బట్టి అధికారులు నేరుగా శాస్త్రవేత్తలను సైతం ఆయా పొలాల్లోకి పంపించేందుకు చర్యలు తీసుకుంటారు.

మండలానికి ఒకటి చొప్పున..

మొదటి దశలో మండలానికి ఒక పీహెచ్‌డీసీని ఏర్పాటు చేసి ఆ మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లోని నిష్ణాతులైన వీపీఏను ఎంపిక చేస్తారు. వీరిని పీహెచ్‌డీసీ డాక్టర్‌గా నియమిస్తారు. అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, హార్టీకల్చర్ ఎమ్మెస్సీ చేసిన వారికి తొలి ప్రాధాన్యం. వీరు మండలంలోని పంటలను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటారు. తొలివిడతలో ఎంపిక చేసిన వీపీఏలకు వచ్చే గురువారం జిల్లా కేంద్రంలో శిక్షణ అందించనున్నారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన వర్సిటీలోని శాస్త్రవేత్తలు సేద్య పద్ధతులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు. ఇలా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో తొలిదశలో 47 మంది వైద్యులను నియమించనున్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా..



రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. దీనిలో భాగంగా పీహెచ్‌డీసీ డాక్టర్లను నియమించి పంటలు ఆరోగ్యంగా ఉండి నాణ్యమైన దిగుబడులు ఇచ్చేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం మండలానికి ఒకరు చొప్పున పంటల డాక్టర్‌ను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు ఎంపిక చేసిన వారికి శిక్షణ అందిస్తాం.

– వై.రామకృష్ణ, వ్యవసాయ శాఖ జేడీ

విలువలకు పట్టం.. సందేశాత్మకం



ప్రేమతో నాన్న నాటికలో సన్నివేశం

యలమంచిలి: కొంతేరులోని పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో 41వ అఖిల భారత స్థాయి నాటిక పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. ఆదివారం ఆఖరి రోజు ప్రదర్శించిన రెండు నాటికలు విలువలకు పట్టం కట్టాయి. భర్త వికృత చేష్టలు భరించలేక ఆత్మహత్యకు యత్నించిన కుమార్తెను రక్షించి ఇంటికి తీసుకువచ్చిన తండ్రి, తన బిడ్డకు ధైర్యం చెప్పి అల్లుడిని దారికి తెచ్చే ఇతివృత్తంతో ప్రేమతో నాన్న నాటిక ప్రదర్శించారు. శ్రీ సాయి ఆర్ట్స్ (కొలకలూరు) వారు ప్రదర్శించిన నాటికను రావి నాగేశ్వరరావు రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. అక్రమ సంబంధం నేరం కాదనే చట్టం ఏ విధంగా సమర్థనీయమని ప్రశ్నించేలా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికను ప్రదర్శించారు. తెలుగు కళా సమితి (విశాఖ) వారు నాటికను ప్రదర్శించగా పీటీ మాధవ్ రచనా సహకారం అందించారు. కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించారు.

కార్మిక లోకం జిందాబాద్





కరాలనే ఆయుధాలుగా చేసి.. నరాల బిగువును శక్తిగా మలిచి.. రక్తాన్నే చెమటగా మార్చిన శ్రమ దాతవు నీవు.. అంతటా నువ్వే అన్నింటా నువ్వే.. నీవు లేనిదే ప్రపంచ గమనం లేదు.. నీవు చిందించే చెమట చుక్కలకు వెలకట్టే షరాబు లేదు.. అందుకే ఓ కార్మికుడా.. అందుకో ప్రపంచ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

రాష్ట్రంలో ఎల్లో వైరస్.. జరభద్రం

- ప్రజలకు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచన
- తెలుగుదేశం పార్టీకి దాదాపు 100 స్థానాల్లో అభ్యర్థులు లేరని వెల్లడి



తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రానికి ఎల్లో వైరస్ సోకబోతోందని, ప్రజలందరూ జాగ్రత్త వహించాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు వైరస్‌గా మారి రాష్ట్ర ప్రజలను అధోగతి పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, మరోమారు మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో దాదాపు 100 స్థానాలకు టీడీపీకి అభ్యర్థులు లేరని ఎద్దేవా చేశారు.

ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ముందుకు సాగుతుందని అన్నారు. వయసు మళ్లిన చంద్రబాబు.. ఎల్లో మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాడని, అయినా ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. టీడీపీ ప్రజలపై విషం వెదజల్లుతోందని విమర్శించారు.

బుద్ధిమాలినవాడిలా చంద్రబాబు ప్రచారం

చంద్రబాబు ప్రవర్తన బుద్ధిమాలినవాడిగా ఉందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసినా హుందాతనం అలవర్చుకోలేదని.. చంద్రబాబు లేకి వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. టీడీపీ, ఎల్లోమీడియా దుష్ప్రచారానికి దూరంగా ఉండకపోతే ప్రజలు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

జనసేన అభిమానులు, సామాజిక వర్గీయుల్లో ఆందోళన

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాజకీయంగా వ్యవహరిస్తున్న తీరుతో అతని అభిమానులు, సామాజికవర్గంలోని యువత ఆందోళనకు గురవుతున్నారని మంత్రి చెప్పారు. ఎవరైనా పార్టీ పెడితే ముఖ్యమంత్రి కావాలని పోరాటం చేస్తారు.. కానీ చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ కలిసి ముందుకు వెళ్లడం వారికి ఇష్టం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని పవన్‌కల్యాణ్ అభిమానులు, సామాజిక వర్గీయులు కోరుకుంటున్నారని చెప్పారు. టీడీపీతో కలిసి పోటీచేస్తే జనసేనకు ఆదరణ ఉండదని ఆందోళన చెందుతున్నారని వివరించారు. వాడుకుని వదిలేసే గుణం చంద్రబాబుదని, ఆ విషయాన్ని జనసేన శ్రేణులు గుర్తించారని మంత్రి తెలిపారు. కాపు సోదరులు, పవన్ అభిమానులు జనసేన అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, ఒక్క సామాజికవర్గంతో సాగితే అధికారం చేపట్టిన రాజకీయ పార్టీ లేదని గుర్తుచేశారు. 2024లో టీడీపీ పూర్తిగా కనుమరుగవుతుందని స్పష్టం చేశారు.

పాఠశాలల రక్షణకు నైట్ వాచ్‌మెన్లు

- నాడు–నేడు పాఠశాలలకు ప్రాధాన్యం
- తొలివిడతలో 190 మంది నియామకానికి చర్యలు
- నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ వేతనం



కాళ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

సాక్షి, భీమవరం: విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్కారీ బడుల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలోని 190 పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్లను నియమించనుంది. మనబడి– నాడునేడు పథకంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను కోట్లాది రూపాయల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. అయితే కొన్నిచోట్ల ప్రభుత్వంపై అక్కసుతో కొందరు పాఠశాలల్లోని మౌలిక వసతులను ధ్వంసం చేస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నాడు–నేడులో మొదటి విడత అభివృద్ధి చేసిన పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించనుంది. దీనికి సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలపై పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది.

జిల్లాలో ఇలా..

పశ్చిమగోదావరి జిల్లాలో 1,382 హైస్కూళ్లకు గాను తొలి విడత నాడు–నేడులో 197 పాఠశాలలను అభివృద్ధి చేశారు. వీటన్నింటిలో నైట్ వాచ్‌మెన్లను నియమించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఏడు చోట్ల నైట్ వాచ్‌మెన్లు ఉండగా మిగిలిన 190 పాఠశాలల్లో నియామకాలకు చర్యలు చేపట్టారు. నైట్ వాచ్‌మెన్‌కు నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తారు.

వాచ్‌మెన్ విధులు

- పాఠశాల మూసే ముందుగానే హాజరుకావాలి.
- పాఠశాల వద్ద అన్ని రోజుల్లోనూ విధులు నిర్వర్తించాలి.
- పాఠశాల ఆస్తికి ఎటువంటి నష్టం కలగకుండా రక్షకుడిగా పనిచేయాలి.
- ఎక్కడైనా అసాధారణ కార్యకలాపాలు జరిగినపుడు స్కూల్ హెచ్‌ఎం, పోలీసుస్టేషన్, అగ్నిమాపక విభాగాలకు సమాచారం అందించాలి.
- ఆర్వో ప్లాంట్‌ను శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం వంటి పనులు చేయాలి.

మార్గదర్శకాలు

- పాఠశాలల పేరెంట్ కమిటీల ద్వారా నైట్‌వాచ్‌మెన్ నియామకం ఉంటుంది.
- పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయా, కుక్‌ల భర్తలకు ప్రాధాన్యమిస్తారు.
- మాజీ సైనికులకు రెండో ప్రాధాన్యత ఉంటుంది.
- 60 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి.
- ఎంపికైన వారికి గౌరవేతనం ఆయా పాఠశాలల టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ నుంచి చెల్లిస్తారు.

త్వరితగతిన నియామకాలు



జిల్లాలో నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేసిన 190 పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించాల్సి ఉంది. తొలి విడతగా 197 స్కూళ్లను అభివృద్ధి చేయగా ఇప్పటికే ఏడు చోట్ల నైట్ వాచ్‌మెన్ ఉన్నందున మిగిలిన చోట్ల నియామకాలకు చర్యలు తీసుకున్నాం. తల్లిదండ్రుల కమిటీ, ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో నైట్ వాచ్‌మెన్ నియామకాలకు ఆదేశాలు జారీ చేశాం. త్వరలోనే నియామకాలు పూర్తిచేస్తాం.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

నూక సమస్యను అధిగమించండిలా..

కేవీకే సమన్వయకర్త సూచనలు



ఉండి : ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం ముక్కలుగా విరిగి నూకలుగా మారి రైతుకు నష్టాలు తీసుకురాకుండా జాగ్రత్తలు పాటించాలని ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎస్.మల్లికార్జునరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతులు ఎంటీయూ 1121, 1153, 1156, 3626, ఎస్ఎల్ 10, పీఆర్ 126 రకాలను 2.75 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆయా రకాల్లో గింజ విరిగిన సమస్య కనిపిస్తోందని తెలిపారు. దీంతో రైతులు అదనంగా 2 నుంచి 3 కిలోల ధాన్యం చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా నూక సమస్యను అధిగమించవచ్చని సూచించారు. వరి పూత సమయంలో పైపూతగా ఎక్కువగా నత్రజని ఎరువులు వేయడం వల్ల, పంట పక్వానికి వచ్చినా కూడా కోతను ఆలస్యం చేయడం వల్ల గింజలో పగుళ్లు వస్తాయని తెలిపారు. కోత సమయంలో క్రమక్రమంగా కాకుండా ఒకేసారి చేలో నీటిని తగ్గించడం, చౌడు భూముల్లో సాగు వల్ల కూడా నూక సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. దోమపోటు, ఆకుఎండు తెగులు, పొడ, అగ్గి, పొట్టకుళ్లు తెగుళ్లు కూడా సమస్యకు కారణాలవుతున్నాయని తెలిపారు.

మిల్లింగ్‌లో సమస్య నివారించేలా..

చిరుపొట్టదశలో నత్రజని ఎరువులు వాడకూడదని సూచించారు. వెన్నులో 80–90 శాతం గింజలు పసుపు రంగులోకి మారితే పంట కోయడం, పూర్తిగా ఎండిపోయే వరకూ వరిచేనును ఉంచకుండా ఉండటం, పంట పక్వానికి వచ్చిన తర్వాత చేనుమీద ఉంచితే దిగుబడి తగ్గడంతో పాటు పగుళ్లు ఏర్పడతాయని తెలిపారు. తెగుళ్లను సకాలంలో అరికట్టాలని, ధాన్యంలో తేమను ఒకేసారి తగ్గించకూడదని సూచించారు. సాధారణ ఎండలో ఆరబెట్టి తేమశాతం 12 వచ్చే వరకు తగ్గించాలని తెలిపారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే గింజలో పగుళ్లు ఏర్పడతాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కలిసిపూడిలో దొంగతనం

ఉండి: ఉండి మండలం కలిసిపూడిలో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉప్పల లక్ష్మీనారాయణ తన కుటుంబంతో కలిసి శనివారం రాత్రి ఉండి సంతమార్కెట్‌లో జరుగుతున్న పోలేరమ్మ జాతర మహోత్సవానికి హాజరయ్యాడు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్ళి చూడగా ఇంటిముందు ఉన్న మెస్‌కు వేసిన తాళాలు పగుల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని 5 కాసుల బంగారు వస్తువులు, 17 తులాల వెండి పట్టీలు, రూ.లక్ష నగదును దొంగిలించినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు.

కొడుకు మరణం తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

ఉండి: కొడుకు మరణాన్ని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం చిలుకూరు గ్రామానికి చెందిన ముదునూరి రామకృష్ణంరాజు చిన్న కొడుకు వీర్రాజు రెండు నెలల క్రితం క్యాన్సర్‌తో మృతి చెందడంతో తండ్రి అప్పటి నుంచి బెంగపెట్టుకున్నాడు. కొడుకు మరణాన్ని తట్టుకోలేక ఏప్రిల్ 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతనిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మరణించినట్లు సమాచారం అందింది. మృతుడి భార్య తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

పెదవేగి: అనుమానాస్పద స్థితిలో ఓ గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైందని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి మండలం విజయరాయి గ్రామ శివారు గంగానమ్మ గుడి వెనుక తమ్మిలేరు కాలువ వాగు గట్టు వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం స్థానికులకు కనిపించిందని, సంఘటనా స్థలానికి వెళ్ళగా, గుర్తుపట్టలేని స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్సై అన్నారు. మృతురాలికి 50 నుంచి 55 సంవత్సరాల వయసుంటుందని.. భిక్షాటన సంచి ఉందని చెప్పారు. మృతదేహం ఉన్న పరిస్థితిని బట్టి హత్యగా అనుమానం వ్యక్తం చేస్తూ, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఆచూకి తెలిసిన వారు పెదవేగి ఎస్సై 9440796638 నెంబర్‌కు సంప్రదించాలని ఎస్సై కోరారు.

ముహూర్తాలకు వేళాయె..
మోగనున్న పెళ్లి బాజాలు

- మే నెల 6 నుంచి జూన్ 27 వరకు ముహూర్తాలు
- కళకళలాడనున్న కల్యాణ మండపాలు
- షాపింగ్ మాల్స్, కేటరింగ్స్, పురోహితులు బిజీబిజీ





జంగారెడ్డిగూడెం: పెళ్లి కళ వచ్చేసింది. బాజాలు మోగనున్నాయి. వచ్చే నెల 6 నుంచి జూన్ 27వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నాయి. తమ పిల్లల పెళ్లిళ్లు త్వరగా చేయాలని ఉవ్విళ్లూరుతోన్న వారికి ఈ రెండు నెలల్లో ఉన్న ముహూర్తాలు ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. వాతావరణం పెళ్లి శోభతో సందడిగా మారనుంది. పురోహితులకు గిరాకీ పెరిగింది. లైటింగ్, డెకరేషన్, వంటలు చేసే వారు, ఆర్కెస్ట్రా, ఇతర పెళ్లి పనులు వారందరికీ చేతినిండా పని దొరుకనుంది.

ముహూర్తాలు ఇవే :

మే : 6, 8, 9, 10, 11, 15, 16, 20, 29, 30

జూన్ : 1, 3, 5, 6, 7, 11, 12, 23, 24, 26, 27

పెరిగిన డిమాండ్

మే, జూన్ నెలల్లో సుమారు 20కి పైగా మూహూర్తాలు ఉన్నాయి. దీంతో ఇటు యువతీ యువకుల కుటుంబాలతో పాటు, పెళ్లిళ్ల సీజన్‌పై ఆధారపడి జీవనాధారం పొందే వారికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. ఒక్కసారిగా కల్యాణ మండపాలు, డెకరేషన్‌లు, లైటింగ్, పురోహితులు ఇలా పెళ్లికి కావాల్సిన అన్ని విషయాల్లో డిమాండ్ పెరిగింది. ఇప్పటికే చాలా కల్యాణ మండపాలను బుక్ చేసుకోగా, మరికొందరు వాటి వెదుకులాటలో పడ్డారు. పురోహితులకు సైతం గిరాకీ పెరిగింది. ఇక డెకరేషన్, లైటింగ్ విషయానికొస్తే అంతకు అంతే. ప్రస్తుత కాలంలో ముఖ్యంగా పెళ్లిలో ఫొటోలు, వీడియోలు అవసరం. కొంత కాలంగా ఖాళీగా ఉన్న ఫొటో, వీడియో గ్రాఫర్లు ఈ పెళ్లిళ్ల సీజన్‌ను సద్వినియోగం చేసుకునేందుకు సమాయత్తమయ్యారు. వీరికీ డిమాండ్ పెరిగింది. కేటరింగ్‌కు కూడా డిమాండ్ పెరిగింది. గతంలో ఇంటి వద్దే భోజన ఏర్పాట్లు చేసుకునే వారు. మారుతున్న కాలంతో పాటు, కరోనా తోడు కావడంతో ఎక్కువ మంది కేటరింగ్‌కే మొగ్గుచూపుతున్నారు.

పెరగనున్న నగల కొనుగోళ్లు

పెళ్లిళ్లల్లో బంగారం కొనుగోలు సర్వసాధారణం. మంగళసూత్రాలు, ఉంగరాలు, నల్లపూసలు ఇలా అత్యవసరమైన వాటితో పాటు, ఆడవారికి అలంకరణకు వినియోగించే నగలు, గాజులు, చెవి దుద్దులు కొనుగోలు చేస్తుంటారు. బంగారం ధర పెరిగి కొనుగోళ్లు అంతంత మాత్రంగా ఉంటోంది. పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారం అమ్మకాలు పెరుగుతాయని వ్యాపారులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే సంక్రాంతి తరువాత కొద్దిగా స్తబ్దుగా ఉన్న బట్టల దుకాణాల వ్యాపారం పెళ్లిళ్ల సీజన్‌తో రద్దీ పెరుగనుంది.

శుభకార్యాలకు వైశాఖమాసం ఉత్తమం



మార్చి 29 నుంచి ప్రారంభమైన గురుమూఢమి మే 1తో పూర్తవుతుంది. గురు మూఢమి నెల రోజుల పాటు ఎటువంటి శుభకార్యాలూ చేయరు. మే 2 నుంచి వైశాఖ మాసం ప్రారంభమవుతుంది. ఉత్తరాయణంలో వైశాఖ మాసం శుభకార్యాలకు ప్రసిద్ధి. ఈ మాసం చేసిన శుభకార్యాల వద్ద అత్యధిక శుభప్రాప్తి కలుగుతుందని ప్రతీతి. వైశాఖ మాసంలో వివాహాలు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, శంకుస్థాపనలు ఎక్కువగా నిర్వహిస్తారు.

– నల్లూరి రవికుమారాచార్యులు, ప్రధానార్చకులు, గోకుల తిరుమల పారిజాతగిరి, జంగారెడ్డిగూడెం

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం: మండలంలోని ఆరుగొలనులో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

గాలి వాన బీభత్సం

ముసునూరు: మండలంలో రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన కుండపోత వర్షం, ఈదురుగాలి అతలాకుతలం చేసింది. ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కురిసిన వాన ధాటికి పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో మండలంలో రవాణా వ్యవస్థ స్తంభించి, విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ముసునూరులో విద్యుత్ స్తంభం విరిగి రహదారికి అడ్డంగా పడడంతో దళిత వాడల వైపు, వలసపల్లి, ధర్మాజిగూడెం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో రవాణా నిలిచి పోయింది. చెక్కపల్లిలో మరీదు నాగరాజు ఇంటిపై రేకులు లేచి పడిపోయి నుజ్జు, నుజ్జు కావడంతో కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. అక్కిరెడ్డిగూడెంలో సుమారు 30 ఎకరాలకు పైగా అరటి పంట నేల కొరిగింది. రమణక్కపేట, సూరేపల్లిల్లో మామిడి కాయలు నేల రాలిపోయాయి. గుళ్ళపూడి శివారు గుడిపాడులో మేతకు వెళ్లిన గేదెపై తాడి చెట్టు విరిగి పడడంతో 80 వేల విలువైన పాడిగేదె మృతి చెందింది. రవాణా నిలిచి పోయిన చోట్ల ఎస్సై ఎం.కుటుంబరావు ఆధ్వర్యంలో ఆటంకాలను తొలగించి, రవాణా సౌకర్యాలను పునరుద్ధరిస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ హేమ సుందరకుమార్ ఆధ్వర్యంలో పడిపోయిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను ఆరంభించారు. రోడ్లపై పడిన చెట్లను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ తెలిపారు.



గుడిపాడులో మృతి చెందిన గేదె

ట్రక్కు బోల్తా.. పలువురికి గాయాలు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం నెర్సిగూడెం సమీపంలో కామయ్యపాలెం వెళ్లే రహదారి వాగు వద్ద ఆదివారం ట్రాక్టర్ ట్రక్కు తిరగబడి పలువురు గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లికి చెందిన ధర్మరాజు అనే రైతుకు చెందిన ట్రాక్టరు వర్జీనియా పొగాకు లోడు వేసుకుని వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ తిరగబడింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ ట్రక్కులో స్వర్ణవారిగూడెంకు చెందిన కూలీ తడికమళ్ళ వెంకాయమ్మ కుడి కాలు విరిగింది. కండెల్లి సుజాత, యరమాల భారతిలు కూడా గాయపడ్డారు. గాయపడిన వారికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన వారిని 108లో తరలిస్తున్న దృశ్యం

కళా రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

సాక్షి, భీమవరం: సమాజంలో సాంఘిక దురాచారాలను పారదోలడానికి నాటక రంగం చేసిన కృషి ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. భీమవరంలోని డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న 16వ జాతీయ స్థాయి నాటిక పోటీల ముగింపు సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. మన దేశానికి సంస్కృతి, సాంప్రదాయాలే అత్యంత ప్రాధాన్యతను తెచ్చిపెట్టాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాలను అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని, దానిలో భాగంగానే నాటక రంగంలో ప్రముఖులను నగదు బహుమతులతో సత్కరిస్తున్నారన్నారు. సినీ నటుడు సుబ్బరాయ శర్మ మాట్లాడుతూ నాటక రంగానికి కళా పరిషత్‌ల ద్వారా మంచి ప్రాచుర్యం లభించిందని పరిషత్‌లు నిర్విఘ్నంగా సాగినంత కాలం నాటక రంగానికి ఎలాంటి లోటు ఉండదన్నారు. సినీ నటుడు పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ నాటక రంగాన్ని ప్రోత్సహిస్తున్న కళాపరిషత్‌లకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పెన్మెత్స సుబ్బరాజు, సుబ్బరాయ శర్మ, వైద్య నిపుణుడు పద్మశ్రీ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, నాటక ప్రయుక్త పంపన దయానంద్ బాబు, నటుడు దర్శకుడు ఎన్.రవీంద్రరెడ్డి, సినీ నటుడు సుబ్బరాజు తల్లిదండ్రులు పీఆర్‌కె వర్మ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం అభినయ ఆర్ట్స్ గుంటూరి వారి గుప్పెడంత గుండెలో సాంఘిక నాటకం ఆకట్టుకుంది. నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఎస్‌వీఆర్ విశ్వేశ్వరరావు, మంతెన వెంకట నర్సింహ సీతారామరాజు, పోలిశెట్టి మల్లిబాబు, అయ్యగారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో చైతన్య భారతి ఆధ్వర్యంలో సినీ నటుడు సుబ్బరాయ శర్మను సన్మానిస్తున్న దృశ్యం



నటుడు పెన్మెత్స సుబ్బరాజును సన్మానిస్తున్న దృశ్యం

గుబ్బల మంగమ్మతల్లి గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు లారీలు, మినీవ్యాన్‌లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో తరలివచ్చి మంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు ఈ ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి అనుమతిని ఇచ్చారు. అలాగే వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో సాయంత్రం 5 గంటలలోపు భక్తులందరూ బయటకు వెళ్ళే విధంగా ఏర్పాట్లు చేశారు.



గుబ్బల మంగమ్మ గుడికి వచ్చిన భక్తులు

శ్రీవారి దేవస్థానం ఉద్యోగిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలో ఇటీవల జరిగిన దర్శనం టికెట్ల రీప్రింట్ స్కాంకు సంబంధించిన వ్యవహారంలో ఒక ఉద్యోగిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఆలయ ఉత్తర రాజగోపుర ప్రాంతంలోని టికెట్ల కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న రికార్డ్ అసిస్టెంట్ పవన్‌కుమార్ రూ. 200 దర్శనం టికెట్లను రీప్రింట్ చేసి, భక్తులకు విక్రయిస్తున్నట్టు గత నెల 10న ఆలయ అధికారులు గుర్తించి అదేరోజు అతడ్ని సస్పెండ్ చేశారు. విచారణ అనంతరం ఆలయ ఏఈఓ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కుక్కునూరు: ఆదివారం మండలంలోని ఉప్పేరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడగా ఓ వ్యక్తికి కాలు విరిగింది. స్థానికుల వివరాలు ప్రకారం, పుల్లప్పగూడెం గ్రామానికి చెందిన మడివి విజయభాస్కర్, మడివి అరవింద్‌కుమార్, మడివి చరణ్‌తేజ్ బైక్‌పై ఉప్పేరు వైపు వస్తుండగా ట్రాక్టర్ టైర్ పేలి అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో చరణ్‌తేజ పక్కకు పడిపోగా అరవింద్‌కుమార్, విజయభాస్కర్‌లు బైక్‌తో సహా ట్రాక్టర్ టైర్ కింద ఇరుక్కుపోయారు. స్థానికులు జేసీబీతో మూడు గంటల పాటు శ్రమించి ట్రాక్టర్ టైర్ కింద ఇరుక్కున వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో అరవింద్ కుమార్‌కు కాలు విరిగింది.



ట్రాక్టర్ ఇంజిన్ టైర్ కింద పడ్డ యువతను బయటకు తీస్తున్న స్థానికులు

అత్తింటి వేధింపులకు మహిళ బలి

భీమడోలు: వివాహితను కట్నం కోసం వేధింపులకు గురి చేసి ఆమె మృతికి కారణమైన భర్త, అత్తమామలను భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వారికి భీమడోలు కోర్టు రిమాండ్ విధించింది. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ వివరాల మేరకు.. పూళ్ల శివారు ఎంఎంపురం ఎస్సీ కాలనీకి చెందిన పెయింటర్ బిరుదుగడ్డ రవి అదే గ్రామానికి చెందిన ఏలూరు వీర్రాజు కుమార్తె శైలజ(20)ను ఆరు నెలల కితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లయిన కొత్తలో శైలజను బాగానే చూసుకున్న రవి తర్వాత తల్లిదండ్రులైన ఆదిలక్ష్మీ, సుల్తాన్‌ల ప్రోత్సహంతో కట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక శైలజ ఈనెల 9 రాత్రి తిన్నర్ తాగింది. శైలజను చికిత్స నిమిత్తం భీమడోలు ఆస్పత్రికి, అక్కడ నుంచి విజయవాడకు తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 28వ తేదీ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు 30న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

ఇంటర్మీడియట్‌తో ఉద్యోగం

- హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంతో సాధ్యం
- ఎంపికైతే ప్రారంభం నుంచే రూ.10 వేలు సంపాదన
- సాఫ్ట్‌వేర్ రంగంలో అద్భుత అవకాశం

TECH BEE
EARLY CAREER PROGRAM

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేటి యువత ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలే లక్ష్యంగా విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేవలం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వెంటనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం లభించడమంటే సాధారణ విషయం కాదు. రాష్ట్ర ప్రభుత్వం అలాంటి అసాధారణాన్ని సాధ్యం చేసింది. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి సంస్థను సమాయత్తం చేసింది. నైపుణ్యాభివృద్ధి సంస్థ భారత దేశపు అతి పెద్ద ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్‌తో ఒప్పందం చేసుకుని ఇంటర్ పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది.

2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అభ్యర్థులు హెచ్‌సీఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాంకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలి. అనంతరం అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ ఉంటుంది. తొలుత ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి ఆ పరీక్షలో ఎంపిక అయిన అభ్యర్థులకు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపిక అయిన అభ్యర్థులు హెచ్‌సీఎల్ నుంచి టెక్‌బీ ప్రోగ్రాంలో చేరడానికి ఆఫర్ లెటర్ పొందుతారు. ఈ టెక్‌బీ ట్రైనింగ్ ప్రోగ్రాం కాలపరిమితి ఒక సంవత్సరం. ట్రైనింగ్‌లో అభ్యర్థి ఇంటర్న్‌షిప్ కోసం విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు తదితర హెచ్‌సీఎల్ క్యాంపస్‌లకు వెళ్లాలి. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి ల్యాప్‌టాప్‌తో పాటు ఇంటర్నెట్ చార్జీలు చెల్లిస్తారు.

ప్రారంభంలోనే రూ.10 వేల జీతం

హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంకు ఎంపికైన అభ్యర్థులకు రూ.10,000 చొప్పున స్టైఫండ్ ఇస్తారు. ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగిగా మారిన అనంతరం వారు చూపే ప్రతిభ ఆధారంగా సంవత్సరానికి రూ.1.72 నుంచి 2.2 లక్షల జీతాన్ని పొందే అవకాశం ఉంటుంది. హెచ్‌సీఎల్ టెక్‌బీ ట్రైనింగ్ ప్రోగ్రాం కోసం అభ్యర్థులు రూ.1,18,000 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆర్థికంగా వెనుకబడిన రూ.30,000 చెల్లించి మిగిలిన రూ.88,000 కోసం యాక్సిస్ బ్యాంక్ అందించే ఎడ్యుకేషన్ లోన్ పొందవచ్చు. ఈ లోన్ కోసం అభ్యర్థి ఎలాంటి అదనపు హామీ పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. కేవలం హెచ్‌సీఎల్ అందించే ఆఫర్ లెటర్ సమర్పిస్తే సరిపోతుంది. ఈ లోన్ డబ్బులు, హెచ్‌సీఎల్‌లో ఉద్యోగిగా చేరిన అనంతరం తన నెలవారి జీతంలో ఈఎంఐ రూపంలో తీర్చే అవకాశాన్ని హెచ్‌సీఎల్ సంస్థ కల్పిస్తుంది.

ఉన్నత విద్యావకాశాలు..

హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంకు ఎంపికైన వారు కేవలం ఉద్యోగం చేయడం మాత్రమే కాకుండా వారు ఉన్నత చదువులు చదవడానికి కూడా హెచ్‌సీఎల్ సహకారం అందిస్తుంది. అభ్యర్థులు ఇంటర్మీడియట్ అర్హతతో మిగిలిపోకుండా ఉండేందుకు ఇదొక మంచి అవకాశమనే చెప్పాలి. ఈ మేరకు హెచ్‌సీల్ సంస్థ దేశంలోని మూడు ప్రముఖ విశ్వవిద్యాలయాలైన బిట్స్ పిలానీ, శాస్త్ర, అమిటీలతో అనుబంధం పెట్టుకుంది. వీటిలో అభ్యర్థి తనకు ఏ సంసస్థలో ఇష్టమైతే ఆ సంస్థలో ఉన్నత సాంకేతిక విద్య నేర్చుకునే అవకాశాన్ని హెచ్‌సీఎల్ సంస్థ కల్పిస్తుంది. వీటి కోసం ఆ సంస్థ అభ్యర్థులకు ఆర్థికంగా కూడా సహకారాన్ని అందిస్తుంది.

3న క్యాంపస్ డ్రైవ్..



రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్‌బీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడంలో భాగంగా మే నెల 3వ తేదీన క్యాంపస్ డ్రైవ్ ఏర్పాటు చేశాం. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ క్యాపస్ డ్రైవ్ ప్రారంభమవుతుంది. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసిన వారికి ఇదొక గొప్ప అవకాశం.

ఆర్.విజయరాజు, డీఆర్‌డీఏ పీడీ, ఏలూరు జిల్లా

సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలపై అవగాహన



రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించేలా ఈ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. గత ఏడాది సైతం టెక్‌బీ ప్రోగ్రాం ద్వారా అనేక మందికి ఉద్యోగావకాశాలు కల్పించాము. ఈ ఏడాది ఎక్కువ మందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 22వ తేదీన నిర్వహించాల్సిన క్యాంపస్ డ్రైవ్‌ను మే నెల 3వ తేదీకి మార్పు చేశాం. దీనికి సంబంధించి మరిన్ని వివరాలకు 9666322032, 9652503799 నెంబర్లను సంప్రదించవచ్చు.

ఈ.తమ్మాజీ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కాళ్ల: ప్రతి ఒక్కరికి విద్యతో పాటు క్రీడా స్ఫూర్తి ఎంతో అవసరమని మాజీ డీఈఓ ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. కోపల్లె హైస్కూల్లో మూడు రోజులపాటు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. దివంగత డాక్టర్ దంతులూరి విజయరామరాజు మెమోరియల్ రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు 6 వాలీబాల్ జిల్లా జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో కృష్ణా జిల్లా మొదటి స్థానం సాధించింది. పశ్చిమగోదావరి జిల్లా రెండో స్థానం, విజయనగరం జిల్లా మూడో స్థానం, శ్రీకాకుళం జిల్లా నాలుగో స్థానం, ఆర్‌ఐఎస్‌ఎల్ వైజాగ్ 5వ స్థానం, ఎస్‌పిఆర్ భీమవరం ఆరో స్థానం సాధించాయి. కార్యక్రమంలో కాళ్ల జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పి.విశ్వనాథరాజు, వి.రామరాజు, దత్తాత్రేయ వర్మ, ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ మూర్తి, కే.బంగార్రాజు, గాదిరాజు కనకరాజు, వాలీబాల్ మాజీ క్రీడాకారులు దంతులూరి శివాజీ రాజు, దంతులూరి ప్రభాకర రాజు, శ్రీనివాసరాజు, ప్రసాదరాజు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న క్రీడాకారులు

పారదర్శకంగా జగన్ పాలన

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ఆరుగొలనులో గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్రంలో నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని, దీంతో పేదలకు సంక్షేమ లబ్ధి చేకూరిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సినిమా అభిమానంతో యువత పవన్ కళ్యాణ్ వైపు తిరుగుతుంటే, ఆయన మాత్రం చంద్రబాబు వెంట తిరుగుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో కాపు సామాజికవర్గానికి న్యాయం చేస్తారా ?అన్యాయం చేస్తారా ? అనేది పవన్ ఆలోచించుకోవాలన్నారు. పార్టీ పెట్టగానే ఎవరూ అధికారంలోకి రారని, 2014లో చంద్రబాబును ఎదిరించి నిలబడి ఉంటే ప్రజలు నమ్మే వారన్నారు. నాడు చంద్రబాబును పల్లెత్తు మాట అనలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాత్రం హైదరాబాద్‌లో కాపురం ఉంటూ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పవన్


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సపోర్టుతో చంద్రబాబు గెలవాలని చూస్తున్నారని, ఈ విషయాన్ని పవన్ గుర్తించడం లేదన్నారు. దుర్మార్గుడితో చేతులు కలిపితే భవిష్యత్‌ఉండదని హితవు పలికారు. ఇటీవల బీజేపీ అధిష్ఠానం సైతం పవన్‌కు హిత బోధ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటికీ పవన్‌లో మార్పు రాకపోగా తాజాగా చంద్రబాబును ఆయన ఇంటికి వెళ్లి పవన్ కలవడం ఆయన వైఖరికి అద్దం పడుతుందన్నారు. సొంత బలంతో ముందుకెళితే అవకాశాలు పెరుగుతాయన్నారు. అంతే గాని కాపులను చంద్రబాబుకు తాకట్టు పెడితే ఊరుకోమన్నారు. కలిసివచ్చినా, విడివిడిగా వచ్చినా తమకేమీ నష్టం లేదన్నారు. సిద్ధాంతపరంగా పోరాటం చేస్తే అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికైనా ప్రజలు రాబోయే ఎన్నికలు స్థానిక నాయకులు చేసిన అభివృద్ధిని, ప్రభుత్వపరంగా చేసిన అభివృద్ధిని చూసి గెలిపించాలని కోరారు. తొలుత ఆరుగొలను ప్రత్తిపాడు వంతెన నుంచి ఆరుగొలను మీదుగా కొత్తూరు వరకు రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి కేఎస్ఎస్ఎస్.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎంపీటీసీలు నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, నార్ని నాగేశ్వరరావు(నాగులు), సచివాలయ కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, సొసైటీ మాజీ చైర్మన్‌లు గోఎరెడ్డి సత్యనారాయణ, నూకల బుల్లియ్య, పంచాయతీ రాజ్ డీఈ ఫణి కుమార్, జేఈఈ ఆలిస్టిన్, పీఆర్ ఏఈ జి.పవన్‌కుమార్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, వీఆర్వో కేఈ.శాంతిరత్నం, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, పంచాయతీ ఈవో బి.శ్రీనివాస చంద్రరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడపా వెంకన్నబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, నాయకులు చిక్కాల ఏడుకొండలు, ఆరేపల్లి సుబ్బారావు, గోపిరెడ్డి సాంబశివరావు, బొద్దాని శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

8వ తేదీ నుంచి వేసవి శిక్షణా తరగతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మే 8వ తేదీ నుంచి జూన్ 16 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 40 రోజుల పాటు వేసవి శిక్షణా తరగతులు 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. గ్రేడ్–1 గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, చదవరులు సమక్షంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పిల్లలు సెలవులను సక్రమంగా వినియోగించుకోవాలని, చదివే అలవాటును పెంపొందించుకోవడం, గ్రంథాలయాన్ని సందర్శించే అలవాటు చేయడం లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. శిక్షణా తరగతులలో పాల్గొన్న విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వివిధ సబ్జెక్ట్స్ స్పోకెన్ ఇంగ్లీషు నిమిత్తం విశ్రాంత ఉద్యోగులు గరికపాటి బాపయ్య శర్మ, నాగదాసి సాల్మన్‌రాజు, జనరల్ సైన్స్‌ను ప్రత్తి వీరాస్వామి, ఇంటి జయప్రద, లెక్కలు సబ్జెక్ట్‌ను సీహెచ్ వెంకటరత్నం, ఎం.మంగరాజు, సోషల్ స్టడీస్‌ను ఎ.జనార్ధన్‌రావు, ఎస్.కొండలరావు బోధిస్తారని వెల్లడించారు. వీటితో పాటు మానసిక, శారీరక ఉల్లాసం కోసం ఆట, పాటలు ఉంటాయని వివరించారు.

క్లుప్తంగా

రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలి


పడాల రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ మురళీకృష్ణ, ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్ : రాబోయే నాలుగు రోజులు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ సూచించారు. ఆదివారం పట్టణ పరిధి పడాల, కడగట్ల, యాగర్లపల్లి రైతు భరోసా కేంద్రాలను ఏవో ఆర్ఎస్.ప్రసాద్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ రైతు తమ ధాన్యాన్ని ఆర్‌బీకేల్లో విక్రయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గోనె సంచులు సమకూర్చుకున్న రైతులకు ప్రభుత్వం సొమ్ములను వారి ఖాతాలకు జమ చేస్తుందన్నారు. వారి వెంట ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

మోడల్ ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్షకు 350 మంది హాజరు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శశి ఇంజినీరింగ్ కళాశాలలో మోడల్ ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.రవిబాబు మాట్లాడుతూ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేందుకు, అత్యున్నతస్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎన్నుకునే రంగం ఏదైనా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ సభ్యులు పర్యవేక్షించారు.

నేటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు సౌజన్యంతో పట్టణంలోని బీఆర్ఎంవీ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నెల రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. 6,7,8,9 తరగతలు చదివే బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధాన్యం ట్రక్కు బోల్తా


వెంకయ్య వయ్యేరు వంతెన వద్ద తిరగబడిన ధాన్యం ట్రక్కు

ఆకివీడు: స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన వద్ద ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. అజ్జమూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వేబ్రిడ్జి వేయించుకుని, తిరిగి ఆకివీడులోని రైస్ మిల్లుకు ధాన్యాన్ని చేరవేసే క్రమంలో వంతెన ఎక్కుతూ ట్రక్కు తిరగబడింది. మండలంలోని పెదకాపవరం గ్రామానికి చెందిన రైతుకు ఆకివీడులోని రైస్‌మిల్లు కేటాయించడంతో ధాన్యం తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా ఈ ప్రమాదం నుంచి ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు.

కళకళలాడిన బీచ్


కేపీ పాలెం బీచ్‌కు తరలి వచ్చిన సందర్శకులు

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండవేడిమి మొదలు కావడంతో సేదతీరేందుకు పర్యాటకులు తీరానికి చేరుకున్నారు. సముద్రస్నానం చేసి అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు.

టైలరింగ్‌తో మంచి ఉపాధి అవకాశాలు

పోడూరు: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు టైలరింగ్ మంచి ఉపాధి అని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు అన్నారు. వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమ్ముచిక్కాల గ్రామంలో మహిళలకు ఉచితంగా నిర్వహించిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ శిబిరాన్ని ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు సందర్శించి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను అభినందించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 35 మంది మహిళలకు 75 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణనిచ్చినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలు మాట్లాడుతూ టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణనివ్వడంతో తమకు జీవనాధారం దొరికిందని సంతోషం వ్యక్తం చేస్తూ వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వాసవీ మాత జయంతి


గూడెంలో విశేషాలంకరణలో వాసవీ మాత


తణుకులో ప్రత్యేకాలంకరణలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి అమ్మవారి జయంతి సందర్భంగా శ్రీ వాసవీ పంచాయతన కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వెంకట రామ రమణ మూర్తి, రాధ, అప్పారావు, దివ్య దంపతులచే తొలుత విఘ్నేశ్వర పూజ, 108 వెండి కలశాలతో కలశ పూజ, సువాసినీ పూజలు జరిపారు. పంచామృతాలతో, వివిధ ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలు, పసుపు, కుంకుమలతో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అమ్మవారికి వెండి చీరను అలంకరించారు. ఆర్యవైశ్యులచే బైక్‌ర్యాలీ జరిగింది. అన్నప్రసాదాలు పంపిణీచేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు మండవల్లి చెన్ననాగేంద్రరావు, కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, పేరూరి కాశయ్య, గ్రంధి సత్యనారాయణ, నటరాజ్, గ్రంధి ప్రసాద్, వనిత క్లబ్ సభ్యులు నాగలక్ష్మి, స్వర్ణ క్రాంతి, రాణి, వాసవిక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తణుకులో

తణుకు టౌన్: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా తణుకు ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో అమ్మవారి రథోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆదివారం మహిళలు, భక్తులు అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి పట్టణంలో అమ్మవారి ఆలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా భారీ రథోత్సవాన్ని నిర్వహించారు. వివిద దేవలు, శక్తి వేషాలు, భారీ బాణసంచా కాల్పులతో పట్టణంలో ఉత్సాహంగా అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య ప్రముఖులు, యువత నాయకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తేమశాతం నిబంధన సడలించాలి


చలివేంద్రచెరువు గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘ నాయకులు

అత్తిలి: అకాలవర్షంతో మాసూళ్లు చేసిన ఆరుదల ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. అత్తిలి మండలం చలివేంద్రచెరువు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం తేమ శాతం 17శాతం నిర్ణయించినా రైతు భరోసా కేంద్రాలు 16 శాతం వస్తేనే కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షంతో తడిసిపోయిందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రభుత్వం టార్పాలిన్‌లు, బరకాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కౌలురైతులు పంపన బ్రహ్మం, జుత్తుగ కైలాసం, గుత్తుల వెంకటేశ్వరరావు, గుత్తుల మల్లీశ్వరి, బీఎస్ఎన్ శర్మ, కునుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంచార వైద్యశాల ద్వారా వైద్య సేవలు

తణుకు టౌన్: స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 10 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, సజ్జాపురం, మండపాక ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 10 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. తణుకు టీచర్స్ కాలనీకి చెందిన ఏవీవీఎస్‌వీ ప్రసాదరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, సభ్యులు జాలా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యనభ్యసించాలి


భీమవరం విష్ణు కళాశాలలో విద్యార్థులకు నగదు బహుమతి చెక్కును అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా అధునాతన పద్ధతులను అవలంబించి విద్యనభ్యసించాలని మావనీర్ గ్రూప్ డైరెక్టర్ అవినీష్ కుమార్ గోయల్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ విష్ణు ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో ప్రతిభ చూపినపుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగంలో చేరడమే లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో కొలువు దక్కించుకోడానికి గట్టి ప్రయత్నం చేయాలని, ఇంగ్లిష్‌లో తడబాటు లేకుండా మాట్లాడడం అలవర్చుకోవాలన్నారు. సాఫ్ట్ స్కిల్స్, కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ వంటి అంశాల్లో సుశిక్షితులై ఉండాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో పదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన 42 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సత్కరించారు. అలాగే వివిధ రంగాల్లో రాణిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులను సత్కరించగా జేఎన్‌టీయూకే పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులు, వివిధ క్రీడా పోటీల్లో విజయం విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రసాద్ రాజు, ఏజీఎం రమేష్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహుజనులను ఐక్యం చేస్తాం

సాక్షి, భీమవరం: రాజకీయ పార్టీలు బహుజనుల హక్కులను పట్టించుకోకుండా ఓటు బ్యాంకులా చూస్తున్నాయని బహుజన రాజ్యం (పూలే- అంబేడ్కర్) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురాల రత్నరాజు అన్నారు. భీమవరంలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మంజూరు కావాల్సిన నిధులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు దక్కకుండా వేరే పథకాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బహుజనుల ఐక్యతను చాటుతూ 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని తెలిపారు.

'వేర్ ఈజ్ రామ్' టీజర్ విడుదల

తాడేపల్లిగూడెం : విద్యాలయాలలో స్నేహాలతో పాటు, సాటి విద్యార్థులకు కష్టం వస్తే అందరం ఒకటే అన్న ఇతివృత్తంతో వేర్ ఈజ్ రామ్ అనే లఘుచిత్రాన్ని ఆదికవి నన్నయ్య స్థానిక క్యాంపస్ ఫార్మసీ విద్యార్థులు తీశారు. నన్నయ్య ఫార్మసీ ఆర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో తీసిన ఈ లఘుచిత్ర టీజర్‌ను క్యాంపస్‌లో ఆదివారం విడుదల చేశారు. మధ్య తరగతి జీవితాలు, ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత బలహీనతలు వంటివాటి ఆధారంగా కె.విజయ్ గోవింద్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. నన్నయ్య క్యాంపస్, గూడెం పట్టణంలోని పలు ప్రాంతాలలో చిత్రీకరణ చేశారు. ఫార్మసీ కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ హీరాభట్టు, అధ్యాపకులు కె.నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీరమేష్ విద్యార్థులను అభినందించారు.

మన్‌కీ బాత్

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలో మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారం బూత్ నెంబర్ 80 శక్తి కేంద్రంలో నిర్వహించారు. ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి నరసింహమూర్తి, పట్టణ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లచ్చిరెడ్డి సత్యనారాయణ, కృష్ణారావు, బీజేపీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. అదే విధంగా 113, 114, 115 శక్తి కేంద్రాల వద్ద అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో మన్ కీ బాత్ జరిగింది.

తణుకులో తణుకు/తణుకు టౌన్: దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన ప్రతీ నెలా ఆఖరి ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి చేసే ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించే కార్యక్రమం మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను తణుకు మండలంలోని వివిధ శక్తి కేంద్రాల ద్వారా వీక్షించారు. ఆదివారం తణుకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, సీనియర్ నాయకులు పీవీఎస్ వర్మ, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి ఐనంపూడి శ్రీదేవిలు పాల్గొని వీక్షించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ మాట్లాడుతూ జిల్లాలోని సుమారు 350 శక్తి కేంద్రాల ద్వారా జిల్లాలోని ప్రజలలు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగ వీక్షించినట్లు తెలిపారు. అలాగే స్థానిక పద్మశ్రీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి వెంకట రామారావు (పీవీఆర్) ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని మన్‌కీబాత్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరిసే సోమేశ్వరరావు, మేకా చంద్రమౌళి, మంగరాతి నాగేశ్వరరావు, చేగొండి నాగేంద్ర పాల్గొన్నారు. వేల్పూరులో మండల బీజేపీ అధ్యక్షురాలు వల్లూరి ఝాన్సీ ఆధ్వర్యంలో మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షించారు.

అత్తిలిలో..

అత్తిలి: మన్‌కీబాత్ కార్యక్రమాన్ని అత్తిలి మండలం పాలి గ్రామంలో 152 పోలింగ్ బూత్‌లో ఆదివారం బీజేపీ నాయకులు ప్రజలతో కలిసి వీక్షించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి నల్లమిల్లి కోటిరెడ్డి, కొవ్వూరి సాయిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెనొప్పిని త్వరగా గుర్తిస్తే వైద్యం సులభం


భీమవరంలో డాక్టర్ గోఖలేను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని చైతన్య భారతీ సంగీత, నృత్య, నాటక పరిషత్ జాతీయ స్థాయి నాటిక పోటీలు సందర్భంగా ఆదివారం చెతన్య భారతి, ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్ అళ్ల గోపాలకృష్ణ గోఖలేతో 'గుండె చప్పుడు' ఆరోగ్యంపై ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోఖలే పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. చాలా మంది గుండెనొప్పి ఎక్కువగా వచ్చే వరకు ఆసుపత్రికి వెళ్లడంలేదని, గుండెనొప్పిని చిన్నపాటి ఆరోగ్యసమస్యతో గుర్తిస్తే జబ్బును త్వరితగతిన నయం చేసుకోవచ్చన్నారు. నేటి ఆధునిక సమాజంలో మానసిక ఒత్తిడి ఎక్కువ కావడం వల్లనే అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అన్ని ఆరోగ్య సమస్యలకు వాకింగ్ ఒక్కటే మార్గం కాదని, 35 ఏళ్ల వయస్సు దాటిన తరువాత వాకింగ్, జాగింగ్ వంటివి వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకే చేయాలన్నారు. గుండె మార్పిడి ఎవరికి సాధ్యమవుతుందని ప్రశ్నించగా ఒకే బ్లడ్ గ్రూప్ కలవారికి మార్పిడి చేయవచ్చన్నారు. అనంతరం డాక్టర్ గోఖలేను ఘనంగా సత్కరించారు. చైతన్య భారతి అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, డాక్టర్ పీఆర్‌కే వర్మ, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కట్రెడ్డి సత్యనారాయణ, పెన్నాడ శ్రీను పాల్గొన్నారు.

నేటినుంచి వెంకన్న కల్యాణోత్సవాలు


వేల్పూరులో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 53వ కల్యాణ మహోత్సవాలను మే 1 నుంచి 6 వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుణ్ణం రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి నుంచి ఆలయం పరిసరాలను వద్ద రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకలరించారు. సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణం, 5న వారి రథోత్సవం, 6న అఖండ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద ప్రతీ రోజూ భజన కార్యక్రమాలు, గీతా పారాయణం, కోలాటం, భరత నాట్యం, డ్యాన్స్ బేబీ, డ్యాన్స్ బేబీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తూర్పువిప్పర్రులో..

ఇరగవరం: తూర్పువిప్పర్రులో ఉన్న న్న శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి త్రిదిన దీక్ష కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి గుండుమోలు రాముడు, జయలక్ష్మి దంపతులతో శ్రీస్వామివారి కల్యాణం జరుగుతుందని చెప్పారు. 2న స్వామివారి ఊరేగింపు, 3న చక్రస్నానం, శ్రీపుష్పయాగం, అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు.

అకాల వర్షాలతో రైతుల ఆందోళన


అజ్జరం రోడ్డులో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రాశులుగా పోసి గడ్డి కప్పుతున్న రైతులు

తణుకు టౌన్: అకాల వర్షాలు దాళ్వా వరి సాగు చేసిన రైతులకు ఆందోళనకు గురి చేస్తున్నాయి. శని, ఆదివారాలలో మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షాలకు కళ్లాల్లోని ధాన్యం తడిసిపోయి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాళ్వా వరి మసూళ్ల ముమ్మరంగా సాగుతున్న సమయంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీరని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి మసూళ్లలో యంత్రాలు ఎక్కువగా పని చేస్తున్నప్పటికీ వర్షాలు కారణంగా యంత్రాలతో కోసిన వరి పంట కళ్లాల్లో ఆరబెట్టే సమయంలో వర్షాలు కురవడంతో ధాన్యం తడిసిపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. కొన్ని యంత్రాలు పొలాల మధ్యలోనే ఉండి పోయి ట్రాక్టర్‌లు వెళ్లలేని పరిస్థితుల ఏర్పడ్డాయని రైతులు వాపోతున్నారు. ఈ దాళ్వా సీజన్‌లో పంటలు అత్యధిక దిగుబడు వచ్చిన సమయంలో అకాల వర్షాల కారణంగా కొంతమేర నష్టాలు వచ్చే అవకాశం వుందని రైతులు పేర్కొంటున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పెంటపాడు : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతులు కావాలని మీనవిల్లూరు గ్రామ సర్పంచ్ చింతపల్లి లక్ష్మి పేర్కొన్నారు. మీనవిల్లూరులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం ఆదివారం రాత్రి హెచ్‌ఎం రవీంద్ర, విద్యాకమిటీ చైర్మన్ నిల్లా నాగమలయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ లక్ష్మి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పార్టీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘ నాయకులు టీవీ రామకృష్ణ పార్టీ నాయకులు కొండ్రెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులకు స్కూలు ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు.

మకర తోరణం సమర్పణ


వీరబ్రహ్మేంద్రస్వామి వారికి వెండి మకర తోరణం అలంకరిస్తున్న భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహానికి భక్తులు సుమారుగా ఆరు కిలోలతో చేయించిన వెండి మకర తోరణాన్ని ఆదివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా స్వామి వారికి అలంకరించారు. ముందుగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి తమ భక్తిని చాటుకుంటూ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి వెండి మకర తోరణాన్ని చేయించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో భక్తి భావన ఉన్నప్పుడే మంచి జరుగుతుందని, ఇటువంటి పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, పట్టణ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు మందారపు శ్యాంసుందర్ బాబు, కుప్పిలి వంశీకృష్ణ వరం, మంకు సత్యనారాయణ, ముంతా నాగేశ్వరరావు, తమిరి శరత్, తాతోలు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.